క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న డీఎం, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఉరుకుంద పుణ్యక్షేత్రానికి స్పెషల్ బస్సులు నడిపే డ్రైవర్లు, కండెక్టర్లకు భోజన ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిపో ఆయిల్ డీసీ టీవీ రమణ, సీఐ కేసీ శేఖర్, బస్టాండ్ మేనేజర్ ఎల్లప్ప, కంట్రోలర్ ఎండీ గౌస్, నాయకులు ముస్తాక్ అహమ్మద్, గద్దం రాజు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్రం (బాటనీ) గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న సోమవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 20 నుంచి 22వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ఆఫ్‌లైన్లో కళాశాల ప్రిన్సిపాల్ చేతికి అందించాలన్నారు. 23న ఉదయం 10 గంటలకు కళాశాలలో డెమో క్లాసులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఫొటోగ్రాఫర్లకు సన్మానం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆదోని లయన్స్ క్లబ్, అవోపా, వామ్ ఆధ్వర్యంలో ఆదోని డివిజన్‌లోని ఫొటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులకు సోమవారం సన్మాన కార్యక్రమం చేపట్టారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో వచ్చిన మార్పుల గురించి వివరించారు. ఫొటోగ్రఫీని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారందరి సేవలు మరువలేనివన్నారు. ఫొటోగ్రఫీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ మహర్షి మహేష్, చీఫ్ సలహాదారు రమేష్, లయన్స్ క్లబ్, అవోపా, వామ్ సభ్యులు శ్రీనాథ్‌గుప్తా, వనపరాజు, డైమండ్ రఘు, వెంకటేశ్వర్లుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం శ్రావణ మాస మాఘ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని ఆలయ అర్చకులు గోవిందు స్వామి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సమక్షంలో అమ్మవారికి తుంగభద్ర నదీ జలాలతో అభిషేకాలు, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు నైవేద్యం సమర్పించి నారికేలలు కొట్టి పూజలు చేసుకున్నారు. మంగళవారం వేకువ జామున అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా జ్యోతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాష్, డీసీ నారాయణలు తెలిపారు.


దేవతా మూర్తులకు ఆభరణాలు



పంచలోహ కవచ అలంకరణలో స్వామి

నందవరం : మండల పరిధిలోని జోహరాపురంలో కొలుదీరిన ఆంజనేయ స్వామి, శివునికి గ్రామానికి చెందిన కురవ యంకమ్మ రూ.1.35 లక్షలు వెచ్చించి పంచలోహ ఆభరణాలు చేయించారు. ఆంజనేయ స్వామికి కవచం, శివు డికి నాగభరణం చేయించి అందజేశారు. సోమ వారం పురోహితులు జనార్ధన్ స్వామి, అమరేష్ స్వామి దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం ఆభరణాలు గ్రామంలోని పూర్వ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న పూజారులు, దాతలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీ శివారులో వెలిసిన నాగలింగేశ్వరస్వామి సన్నిధిలో నాగదేవత విగ్రహ ప్రతిష్ట సోమవారం ఘనంగా జరిగింది. విశ్రాంత ఎంఈఓ శివరాములు, ఇందిర దంపతుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా హోమాలు, కుంకుమార్చన, బిల్వార్చన, విశేష పూజలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు హనుమంతు, లింగారెడ్డి, మురళి, శ్రీనివాసులు, ఆలయ కమిటీ అధ్యక్షులు దశరథ రాముడు, సభ్యులు పాల్గొన్నారు.

ఈరన్నా.. భక్తుల కష్టాలు కనుమా!

- ఉరుకుందలో భక్తులకు కనీస సౌకర్యాలు కరువు
- ఆలయానికి ఏటా రూ.కోట్లలో ఆదాయం
- ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో కనిపించని వైనం
- తాగునీటికీ తప్పని ఇక్కట్లు



పొలంలోని బోరు వద్ద నీరు పట్టుకుంటున్న భక్తులు



ట్యాంకు వద్ద బిందె నీరు రూ.40కు కొనుగోలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి ఏడాదికి సుమారు రూ.15కోట్ల ఆదాయం ఉన్నా భక్తులకు మాత్రం సౌకర్యాలు కల్పించడంలేదు. దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాలు నెల రోజులు పాటు జరుగుతాయి. కనీసం ఈ నెల రోజులు పాటు భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ అధికారులు విఫలం అవుతున్నారు. శ్రావణమాస ఉత్సవాలకు స్వామి దర్శనార్థం 15 నుంచి 20 లక్షల మంది భక్తులు తరలివస్తారు. ఇందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం కనిపించడంలేదు. భక్తులు కనీసం తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారంటే సౌకర్యాలు ఏమాత్రం ఉన్నాయో తెలుస్తోంది.

ఏర్పాట్లు ప్రకటనలకే పరిమితం..

తుంగభద్ర దిగువ కాలువలో వద్ద మహిళా భక్తులకు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నా.. అక్కడ రెండు, మూడు తప్ప భక్తులకు అనుగుణంగా షెడ్లు ఏర్పాటు చేయలేదు. కనీసం తాగునీరు లేక భక్తులు అల్లడిపోయారు. 15 ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నా.. ఇందులో సగం కూడా కనిపించలేదు. ఆలయ పరిసరాలలో ఎక్కడ చూసిన చెత్త చెదారంతో నిండిపోయింది. శానిటేషన్ కోసం 60మంది సిబ్బంది నియమించినట్లు రికార్డులు ఉన్నా వారు ఎక్కడ కనిపించడం లేదు.

తప్పని తాగునీటి కష్టాలు..

తాగునీటి కోసం భక్తులకు తిప్పలు తప్పలేదు. పొలాల్లోని బోర్ల వద్ద వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. సమీపంలో ఎల్ఎల్‌సీ కాలువ ఉన్నా అందులో భక్తులు స్నానాలు చేస్తుండడంతో ఆ నీరు తాగేందుకు పనికిరాదు. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు బిందె నీరు రూ.40అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కోసిగి రూట్‌లో ప్రైవేట్ బోరు వద్ద భక్తులు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. దేవాలయం వద్ద ట్యాంకు భక్తుల అవసరాలను ఏమాత్రం తీర్చడం లేదు. గంటల కొద్దీ క్యూలో నిల్చోవాల్సి వస్తోంది.

తలనీలాల సమర్పణకు రూ.వంద

ఈరన్నస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల్లో అధిక శాతం మొక్కుబడి కింద తలనీలాలు సమర్పిస్తారు. రూ.40 పెట్టి టిక్కెట్ కొనడంతో పాటు గుండు కొట్టాలంటే క్షురకులకు రూ.వంద ఇచ్చుకోక తప్పదు. ఈ విషయం అందరికీ తెలిసిన చర్యలు తీసుకోరు.. దోపిడీని అరికట్టారు.

నీటి కోసం దేవాలయం వద్ద ఇబ్బందులు



తాగునీటి కోసం దేవాలయం వద్ద ఇబ్బందులు పడ్డాం. ఇంత పెద్ద దేవాలయం వద్ద కనీసం తాగడానికి నీరు కూడా సరిగా సరఫరా చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. వసతులు కల్పించక పోయినా పర్వాలేదు. కనీసం తాగునీరు ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైన ఉంది. – చిట్టెమ్మ, కోసిగి

చిన్న పిల్లలకు సైతం వంద రూపాయలంటా



తలనీలాలు తీసేందుకు చిన్న పిల్లలకు సైతం వంద రూపాయలు ఇవ్వాలని క్షురకులు డిమాండు చేస్తున్నారు. టిక్కెట్‌తో పాటు పిల్లలకు కూడా వంద ఇవ్వలంటే కష్టంగా ఉంది. ఇక్కడ పద్ధతుల్లో మార్పు రావాలి అంటే అధికారులు చర్యలు చేపట్టాలి.

–వీరేష్, జంపపురం

రూ.కోట్లలో ఆదాయం ఉన్నా సౌకర్యాలు లేవు



భక్తుల సౌకర్యాలను గాలికి వదిలేశారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా దేవాలయం వద్ద తాగునీటి కోసం కూడా ఇబ్బందులు పడాల్సి రావడం చూస్తుంటే వేరే సౌకర్యాలు ఎలా ఉన్నాయే అర్థం చేసుకోవచ్చు. ఉన్న బోర్ల వద్ద దిమ్మెలు ఏర్పాటు చేస్తే నీళ్లు పట్టుకోవడానికి వీలుంటుంది. –నాగేంద్ర–దొడ్డి బెళగల్

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్లో ప్లాట్ ఫామ్‌పై గుర్తు తెలియని బాలుడు సోమవారం అనుమానంగా తిరుగుతూ ఉండగా.. అక్కడే పని చేస్తున్న ఆది గమనించి బాలుడిని విచారించగా సరైన సమాధానం చెప్పడం లేదు. దీంతో బాలుడిని రైల్వే పోలీసులకు అప్పగించారు. పోలీసులు కూడా విచారించగా సమాధానం చెప్పడం లేదు. దీంతో రైల్వే ఎస్ఐ గోపాల్ బాలుడి ఫొటో తీసి వాట్సప్ గ్రూపులో పోస్టు చేయగా.. ఈ వార్త పట్టణంలో వైరల్ అయ్యింది. బాలుడు కార్వన్ పేటకు చెందిన ఎం. యశ్వంత్‌గా తెలిసింది. వెంటనే తల్లిదండ్రులు సురేష్, రాధలను పిలిపించి బాలుడిని అప్పగించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించండి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు మెయిన్ రోడ్డులో వెలసిన కట్టడాలను తొలగించాలని ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహ సీల్దారు మహేష్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. మెయిన్ బజార్‌లో డ్రైనేజీలను దాటి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. నాయకులు మేకల రాజు, ఎం.యువరాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా రక్షాబంధన్



ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి రాఖీ కడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివకృష్ణయాదవ్ సతీమణి



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఓంశాంతి అక్కయ్య నిర్మల

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: రక్షాబంధన్ వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్ రెడ్డికి, మీనాక్షినాయుడులకు ఓంశాంతి అక్కయ్య నిర్మల రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి సీనియర్ సివిల్ జడ్జి శివకృష్ణయాదవ్ సతీమణి రాఖీ కట్టారు. ఆదోని ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ విశ్వనాథ్, డీఎస్పీ సోమన్న, ట్రైనింగ్ డీఎస్పీ దిరాజ్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు, మహిళా నాయకురాళ్లు కవిత, శిరీష, హసీనా బాను రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

నందవరం : మండల పరిధిలోని గురజాల, నదికైరవాడి, ముగతి తదితర గ్రామాల్లో రాఖీ పండుగ వేడకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్నలకు చెల్లెలు రాఖీ కట్టి ఆశీర్వాదం పొందారు.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు కులుమాల, అలువాల, గాజులదిన్నె, పెద్దనేలటూర్, చిన్న నేలటూర్, హెచ్. కైరవాడి, గంజిహళ్లి, వేముగోడు, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కుల, మత, వయో బేధం లేకుండా పండుగ వేడుకలను ప్రజలు, యువతీ, యువకులు, ఘనంగా జరుపుకున్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఇన్‌చార్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (హెచ్ఎన్ఎస్ఎస్) విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీఓ నాగేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాల పరిశీలన



సౌకర్యాలపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కిబులా కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను, రోగులకు అందిస్తున్న వైద్యం తదితర అంశాలపై వైద్యురాలు జాహ్నవిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆస్పత్రిలో ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఇళ్ల నుంచి చెత్త సేకరణలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని గాంధీనగర్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పట్టణ ప్రజలు చెత్తను మురుగు కాలువల్లో పారబోయకుండా మున్సిపల్ కార్మికులకు చెత్తను ఇచ్చి పారిశుధ్యానికి తోడ్పాటునందించాలని సూచించారు.

హంతకులను ఉరి తీయాలి



భీమాస్ సర్కిల్‌లో ప్రైవేట్ వైద్యుల రాస్తారోకో



ఎమ్మిగనూరులో కేవీపీఎస్ కొవ్వొత్తుల ర్యాలీ

ఆదోని టౌన్: కోల్‌కత నగరంలో వైద్యురాలిపై అఘాయిత్యం చేసిన హంతకులను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదోని పట్టణంలో ప్రజా, విద్యార్థి, మహిళా సంఘాలు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల వైద్యులు నిరసన తెలిపారు. రాస్తారోకో, ధర్నా, పురవీధుల్లో భారీ ప్రదర్శనలు చేశారు.

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులచే ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

గోనెగండ్ల : కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి ఉరి తీయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు.

ఆదోని సెంట్రల్: కలకత్తాలో మెడికో విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్ట్స్ కళాశాల సీనియర్ అధ్యాపకులు అయ్యప్ప, ఎర్రిస్వామి, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్, ఉమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: కోల్‌కతలో పీజీ వైద్య విద్యార్థినిపై అఘాయిత్యం చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ.. ఆమెకు సంతాపంగా సోమవారం రాత్రి కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, నాయకులు కోటేకల్ చిన్నప్ప, సుమాల, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్సీ కాలనీలోని పలు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కోరారు. సోమవారం కాలనీకి చెందిన పలువురు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంబీ చర్చి నుంచి ఖబరస్తాన్ వరకు శిథిలమైన రోడ్డును సత్వరం పునర్నిర్మించాలన్నారు. ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక రోడ్డుతో పాటు కూలిపోయిన ప్రహరీని నిర్మించాలన్నారు. కాలనీకి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ముఖద్వారం నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన వెస్లీ సునీల్, కదిరికోట ఆదెన్న, ఆనంద్, ఇమ్మానియేల్, ఆనంద్ చైతన్య, సుమాల రాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా భావనరుషి భద్రావతి కల్యాణం

ఆదోని అర్బన్: పట్టణంలోని సత్యనారాయణపేటలో వెలిసిన భావనరుషి భద్రావతి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. పద్మశాలి కులసంఘం ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణోత్సవాన్ని ఎమ్మెల్యే పార్థసారథి వీక్షించారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్సీ హాస్టళ్లను ఏర్పాటు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎస్సీ బాలుర, బాలికల ప్రీ మెట్రిక్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 50వేల ఎస్సీ జనాభా వుందని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి లేక పట్టణాలకు వలస వెళ్తున్నారని వారి వెంట పిల్లలను తీసుకెళ్తుడటంతో వారు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇందిరానగర్, ఎన్టీఆర్ నగర్‌లో ఉన్న హాస్టళ్లను ఎత్తివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

గోనెగండ్ల : మండల కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జీనియస్ గ్లోబల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ మండల కార్యదర్శి ఏలియా డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలో ఏఐఎస్ఏ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీనియస్ గ్లోబల్ స్కూల్ బస్సులు సరైన ఫిట్నెస్ లేవని, టాటా సుమో, టాటా ఏసీలో అధిక సంఖ్యలో విద్యార్థులను తరలిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, మహేష్, రాజు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రెండు రోజుల క్రితం తేలికపాటి వర్షానికి వేరుశనగకాయలు తడిసి కొట్టుకుపోయిన విషయం విధితమే. దీనిపై సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి యార్డును పరిశీలించారు. యార్డు మొత్తం కలియతిరిగి రైతులతో మాట్లాడారు. అనంతరం యార్డులో కాలువలను, ప్లాట్‌ఫారంను పరిశీలించారు. తూకాలు వేసిన సంచులను తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఇంటి వద్ద లేదా పొలం వద్ద ఆరబోసుకొని యార్డుకు అమ్మకానికి దిగుబడులను తీసుకురావాలని సూచించారు. రైతులు నష్టపోకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనతో పాటు యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఆదివారం రాత్రి హత్యకు గురైన ఉప్పర శేఖన్న మృతదేహాన్ని సోమవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తమై తరలించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆస్పత్రికి వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో ఎలాంటి హత్యా రాజకీయాలు లేవన్నారు. కేవలం కుటుంబ కలహాలతో మాత్రమే ఇలా జరిగి ఉంటుందన్నారు.

ఉరుకుంద.. భక్తులతో కిటకిట



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



కొండపై పిండివంటలు చేస్తున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా ఈరన్నస్వామి నామస్మరణతో ఉరుకుంద క్షేత్రం పులకించింది. ఆలయ పరిసరాల్లో ఎటూ చూసిన సుమారు రెండు కిలోమీటర్ దూరం వరకు ఇసుక వేస్తే రాలనంతగా భక్తజనంతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. దేవాలయానికి చేరుకునే దారులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు మనరాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి తరలివచ్చిన దర్శించుకున్నారు. భక్తులు ముందుగా ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు చేసి దర్శనానికి క్యూలైన్లో నిలుచుకున్నారు. సోమవారం సుమారు మూడు లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని అంచనా. మూడవ సోమవారం పురస్కరించుకోని ఆదివారం ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరడం విశేషం. ఆదివారం సెలువుతో పాటు సోమవారం ఈ ప్రాంతంలో పాఠశాలలకు, వివిధ కార్యాలయాలకు ఆప్షనల్ హాలిడే ఉండటంతో భక్తులు పోటెత్తారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం రాత్రి 7 గంటలైన దర్శనం కోసం ఉన్న క్యూలైన్లు భక్తులతో దర్శనమిచ్చాయి. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చోటు దొరికితే అక్కడే వంటలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించడం కనిపించింది.

దైవదర్శనానికి 2 గంటల నిరీక్షణ

కాలువలో పుణ్య స్నానాలు చేసి దర్శనానికి వచ్చిన భక్తులకు రద్దీ కారణంగా దర్శనం కోసం 2 నుంచి 3 గంటల పాటు నిరీక్షించాల్సిన వచ్చింది. మూడు కల్యాణ కట్టలు ఏర్పాటు చేసినా భక్తుల రద్దీకి అవి ఏమాత్రం సరిపోలేదు. ఇక్కడ కూడా భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయ పరిసరాలలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కౌతాళం సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మరో ఇద్దరు సీఐలు, ఎస్ఐలు పరిసరా ప్రాంతాల్లో కలియతిరుగుతూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు.

యాజమాన్య పద్ధతులతో వయ్యారిభామ నిర్మూలన



వయ్యారిభామ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న డా. కె. రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: వయ్యారిభామ గడ్డి నిర్మూలనపై సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె. రాఘవేంద్రచౌదరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో వయ్యారిభామ నిర్మూలనపై కేవీకే శాస్త్రవేత్తలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్ర గడ్డి, ముక్కుపుల్ల మొక్క తదితర పేర్లతో వయ్యారిభామను పిలుస్తారని చెప్పారు. ఈ మొక్క ఆమెరికా నుంచి దిగుమతి చేసుకున్న గోధుముల ద్వారా ప్రవేశించి పెను సమస్యగా మారిందని తెలిపారు. మనుషులకు చర్మవ్యాధులు, ఊపిరితిత్తు వ్యాధిని కలుగచేస్తుందన్నారు. ఈ మొక్కలను గుర్తించి పూత రాకముందే పీకి కాల్చేయాలన్నారు. పంట వరసల మధ్యలో ట్రాక్టర్ టిల్లర్‌తో సంవత్సరంలో మూడు, నాలుగు సార్లు దున్నేసి భూమిలో కలిపివేయాలని సూచించారు. అలాగే జైగోగ్రామబైకొలరేట్ అనే పురుగులను వదలి జీవ నియంత్రణ పద్ధతి ద్వారా కూడా నివారించవచ్చునని చెప్పారు.

ఘనంగా మార్కండేయ స్వామి ఉత్సవాలు



కలశాలతో స్వామివారి ఊరేగింపు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో వెలసిన పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని స్వామి వారి మూడు రోజులుగా వెండి కవచ అలంకరణ, అభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళ మహారతులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతి, మార్కండేయ స్వామి ఉత్సవ మూర్తిని రథంపై కొలువుంచి కలశాలు, మేళతాళాలతో ఆలయం నుంచి పురవీధుల గుండా కడపాళెంలోని ఈశ్వర దేవాలయం వరకు ఊరేగించి.. తిరిగి ఆలయానికి చేర్చారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో శ్రీ భక్త మార్కండేయస్వామి జయంతి ఉత్సవాలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి కోటప్పయ్య తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం జరిపించారు.